సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 20 । జూన్ । 2025



రహదారి.. రైట్.. రైట్

అంతర్రాష్ట్ర రహదారి పనులు ప్రారంభమవ్వడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 10లో▸



మట్టి జారి..

దుద్యాల్ నుంచి అల్లిఖాన్‌పల్లి వరకు వేసిన వేసిన జీటీ రోడ్డు ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తోంది. 10లో▸



సర్కారుకే 'సై'

తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించడానికి సంఘటితమయ్యారు ఎన్కేపల్లి మహిళాసంఘం సభ్యులు 11లో▸

న్యూస్‌రీల్

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి



వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఈర్లపల్లి గ్రామస్తులు

దుద్యాల్: ఈర్లపల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం వారు కొడంగల్‌లోని కడా కార్యాలయంలో వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 26 మహిళాసంఘాలకు గాను డ్వాక్రా భవనం, పీర్ల ఏర్పాటుకు మసీద్, ముస్లింలకు కబరస్తాన్ కోసం ఎకరా స్థలం కేటాయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, మహిళా సంఘం గ్రామ అధ్యక్షురాలు సరిత, గ్రామస్తులు విజి బాయి, రవినాయక్, మొగులయ్య, బాష, మహమ్మద్, గుడ్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ప్రవేశ పోటీలకు 14 మంది బాలలు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధికారులు, పీఈటీలు

కుల్కచర్ల: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలకు విద్యార్థులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా గురువారం మండల కేంద్రంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ప్రవేశ పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ మాట్లాడుతూ.. మండల పరిధిలో 10 మంది బాలురు, నలుగురు బాలికలను జిల్లాస్థాయి క్రీడా పాఠశాల ప్రవేశ పరీక్షకు ఎంపిక చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు ప్రవీణ్, కవిత, కేశవులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.లక్ష విలువైన వస్తువుల వితరణ



సామగ్రిని చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

అనంతగిరి: ప్రతీ ఒక్కరు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని సిద్దులూరు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్ మండలం సిద్దులూరు జెడ్పీహెచ్ఎస్‌కు రిటైర్డ్ జీహెచ్ఎం పురుషోత్తం శాస్త్రి రూ.లక్ష విలువైన సామగ్రి అందజేశారు. విద్యార్థులకు ప్లేట్లు, బెల్టులు, ఐడీ కార్డులు, పాఠశాలకు మైక్ సెట్, ప్రింటర్, టేబుల్స్, కుర్చీలు తదితర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పురుషోత్తం శాస్త్రి ఈ ప్రాంతంలో పనిచేసినప్పుడి నుంచి పాఠశాల అభివృద్ధికి పరితపించారన్నారు. ప్రతీ సంవత్సరం పాఠశాలకు ఏదో విధంగా సహకరిస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం పురుషోత్తం శాస్త్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందజేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని అర్హతలు ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. రామకృష్ణారెడ్డి ఎక్కడ పనిచేసిన ఆ పాఠశాల అభ్యున్నతికి పాటుపడుతారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్, వెంకటేశ్, రమేశ్, రాజు, సంగీత, శ్రీదేవి, మీనాకుమారి, ఆంజనేయులు, నరేశ్, నాగలత పాల్గొన్నారు.

నాణ్యమైన పాలే సేకరించాలి

టీజీడీడీసీఎఫ్ చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత

కద్లాల్: పాడి రైతుల నుంచి నాణ్యమైన పాలు సేకరించాలని తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య (టీజీడీడీసీఎఫ్) చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత సూచించారు. కద్లాల్ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని సొసైటీల అధ్యక్షులు, వేతన కార్యదర్శులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విజయ డెయిరీ ద్వారా సేకరించే పాలు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉంటాయన్నారు.

పారిశ్రామిక పరుగులు

రైతుల నిర్బంధాలు, ప్రతిఘటనలు, నిరసనగళంతో గతంలో అట్టుడికిన దుద్యాల్ మండలంలో ప్రస్తుతం పారిశ్రామికవాడ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. అందులో సింహభాగం భూ సేకరణ జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు.

భూ సేకరణలో వేగం పెంచిన అధికారులు

- నిర్ధారించిన హద్దులకు రంగులు
- ఇప్పటి వరకు సేకరించిన భూమి 914.12 ఎకరాలు
- మిగిలింది మరో 263.23 ఎకరాలే..
- త్వరలో కంపెనీలకు అప్పగించే అవకాశం!
- పరిశీలించిన టీఎస్ఐఐసీ అధికారులు



సేకరించిన భూములకు సంబంధించిన హద్దులను పరిశీలిస్తున్న టీజీఐఐసీ అధికారులు

దుద్యాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోని హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల, పులిచర్లతండా, రోటిబండతండా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. నిత్యం ఏదో ఒక శాఖకు చెందిన ఉద్యోగులు వచ్చి భూములకు హద్దులు నిర్ధారిస్తున్నారు. ఎన్నో ఆటంకాల మధ్య సాగిన భూ సేకరణ చివరి దశకు చేరుకుందని వారు తెలుపుతున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) అధికారులు పారిశ్రామికవాడ భూములను పరిశీలించారు. పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ప్రభుత్వం 1,177.35 ఎకరాలకు నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. అధికారులు నేటివరకు 658 మంది పట్టాదారులకు సంబంధించిన 914.12 ఎకరాల భూమిని సేకరించారు. పోలేపల్లి గ్రామంలో 48 ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం టీజీఐఐసీకి అప్పగించారు. వాటికి పరిహారంగా దాదాపు రూ.180 కోట్ల వరకు చెల్లించారు. భూ సేకరణ పోలేపల్లిలో పూర్తి కాగా లగచర్ల, హకీంపేట్ రెవెన్యూ గ్రామాల్లో ఇంకా 263.23 ఎకరాలు సేకరించాల్సి ఉంది.



హద్దుల నిర్ధారణకు వేసిన పసుపు మార్క్

ఇక కంపెనీల ఏర్పాటు

ఇప్పటివరకు సేకరించిన భూముల్లో ప్రభుత్వం త్వరలో కంపెనీల ఏర్పాటుకు శంకుస్థాపన చేసే అవకాశం ఉందని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఫార్మా ఏర్పాటు రద్దు చేసిన నేపథ్యంలో ఎలాంటి కంపెనీలు ఏర్పాటు చేస్తారో అనే చర్చ కొనసాగుతోంది. కాలుష్య రహిత కంపెనీలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

ఉపాధి పండుగ

కంపెనీలు నిర్మాణ పనులు ప్రారంభమైతే నియోజకవర్గంలోని కూలీలకు, 10వ, ఇంటర్ స్థాయిలో చదువుకున్న వారికి సూపర్‌వైజర్‌లుగా ఉపాధి లభిస్తుంది. స్థానిక కాంట్రాక్టర్లకు సైతం చేతినిండా పనులు దొరుకుతాయని భావిస్తున్నారు. కంపెనీల నిర్మాణ దశలో వేల సంఖ్యలో కూలీలు అవసరం ఉంటుందని, ఇక్కడి ప్రాంత వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేయాల్సిన అవసరం లేదనే సంతోషంలో ఉన్నారు.

సేకరించిన భూ వివరాలు

పారిశ్రామవాడ ఏర్పాటుకు ప్రభుత్వం 1,177.35 ఎకరాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా పోలేపల్లి గ్రామంలో 38 మంది రైతుల నుంచి 73.39 ఎకరాల అసైన్డ్ భూమితో పాటు 48 ఎకరాల ప్రభుత్వ భూమిని అదనంగా స్వాధీనం చేసుకున్నారు. హకీంపేట్‌లో 172 మంది రైతులకు సంబంధించి 261.33 ఎకరాల అసైన్డ్, 143.21 ఎకరాల పట్టాభూమి, లగచర్ల రెవెన్యూ పరిధిలో 64 మంది రైతులకు సంబంధించి 72.26 ఎకరాల అసైన్డ్, 212 మంది రైతుల నుంచి 314.13 ఎకరాల పట్టా భూమిని అందించారు. ఇప్పటికే 862.02 ఎకరాలు సేకరించిన అధికారులు మరో 263.23 ఎకరాలు సేకరించాల్సి ఉందని చెప్పారు.

సేకరణకు రైతులు అనుకూలం



రైతులతో మాట్లాడుతున్నాం. త్వరలో మిగిలిన భూమి సేకరిస్తాం. రైతులు అనుకూలంగా ఉన్నారు. అన్నదమ్ముల, తాతల భాగాల్లో తేడా ఉన్నందున సరి చేసుకుని ఇస్తామని చెబుతున్నారు. వారితో నిరంతరం మాట్లాడుతున్నాం.

– కిషన్, తహసీల్దార్ దుద్యాల్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చిత్రంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సదస్సుల్లోనే సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: భూ సమస్యలను సాధ్యమైనంత వరకు రెవెన్యూ సదస్సుల్లోనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన వికారాబాద్ మండలం అత్వెల్లి, కొత్రేపల్లిలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సులు భూ సమస్యల పరిష్కార వేదికలుగా ఉపయోగపడుతున్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తులు స్వీకరించి వాటికి రసీదులు ఇవ్వాలని... ఆన్లైన్‌లో తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ నమోదు రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. తహసీల్దార్ స్థాయిలో సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ ప్రకంపనలు

- సిట్ అధికారుల విచారణలో విస్తుపోయే విషయాలు
- తాండూరులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ఫోన్లతో పాటు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఫోన్ ట్యాప్
- విచారణకు హాజరుకావాలని పలువురికి కాల్స్ చేసిన సిట్ బృందం



తాండూరు: నియోజకవర్గంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. శాసన సభ ఎన్నికల సమయంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ట్యాపింగ్ గురైన ఫోన్లకు సిట్ అధికారులు ఫోన్‌లు చేసి వివరాలను సేకరిస్తున్నారు. ఇందులో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులతో పాటు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి పేరు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

నిగ్గు తేల్చేందుకు స్టేట్‌మెంట్ రికార్డులు

బీఆర్ఎస్ హయాంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు తాండూరులో ప్రచారం జరిగింది. ఎన్నికల అనంతరం పలువురు నేతలు తమ ఫోన్‌లు ట్యాపింగ్ చేశారంటూ ఫిర్యాదు చేశారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని నిగ్గు తేల్చాలని సిట్ బృందానికి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే పలువురు నేతలను సిట్ విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. మొదట రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీత భర్త డాక్టర్ సంపత్‌కుమార్ ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ అధికారుల బృందం రెండు రోజుల క్రితం ఫోన్ చేసి స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు నగరానికి రావాలని కోరారు. ఈ విషయాన్ని డాక్టర్ సంపత్‌కుమార్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సోదరుడు ఆర్‌బీఎల్ కంపెనీ చైర్మన్ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌తో పాటు పలువురు యువ నాయకులకు సిట్ నుంచి కాల్స్ వస్తున్నాయి. పలువురు మీడియా ప్రతినిధులకు చెందిన ఫోన్‌లను సైతం ట్యాపింగ్ చేసినట్లు సమాచారం.

పట్నం అనుచరుల ఫోన్‌లు ట్యాపింగ్

తాండూరు నియోజకవర్గంలో 2023లో బీఆర్ఎస్‌లో ఉన్న మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అనుచరుల ఫోన్‌లు ట్యాపింగ్ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పట్నం ప్రధాన అనుచరులకు సిట్ నుంచి కాల్స్‌ను అందుకున్నారు.



ఇందిరా మహిళా శక్తి- మన దుకాణం ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్

నాలుగు విడతల్లో నగదు జమ

- పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- 613 మంది లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత



సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

అనంతగిరి: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని.. నాలుగు విడతల్లో బిల్లులు ఎప్పటికప్పుడు ఖాతాలో జమ అవుతాయని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం ఆయన వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 613 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతాయని చెప్పారు. గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా అందరికీ ఏక కాలంలో ఇళ్లు ఇవ్వలేక పోతున్నామని ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. పేదలు కడుపు నిండా అన్నం తినాలనే సదాశయంతో రాష్ట్రంలో సన్నబియ్యం ప్రారంభించామన్నారు. పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధికి అధికంగా నిధులను కేటాయిస్తోందన్నారు.

తొమ్మిది రోజుల్లో భరోసా

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులదే అన్నారు. ఉద్యోగులు పేదలకు సేవాభావంతో పనిచేయాలని సూచించారు. వానాకాలం పంటల సాగుకు రైతు భరోసా డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. నిన్నటి వరకు నాలుగు ఎకరాల వరకు రైతులకు అందాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విధంగా తొమ్మిది రోజులలో రూ.9వేల కోట్లు రైతులకు అందుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఉన్న భూములలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు అందుతాయని వివరించారు. అనంతగిరిని పర్యాటకంగా రూ.వేయి కోట్లతో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మెగా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందని.. ఈ ప్రాజెక్టుతో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, డీఆర్డీఓ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టీఏ సభ్యులు జాఫర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టాల్ ప్రారంభం

తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇందిర మహిళా శక్తి మన దుకాణం స్టాల్ ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు.

నేడు స్పీకర్ పర్యటన

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇచ్చేందుకు శుక్రవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ విచ్చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని ఆయన కోరారు.

నేటి నుంచి సోషల్ ఆడిట్

తాండూరు రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకానికి సంబంధించి శుక్రవారం నుంచి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఏపీఓ నరోత్తంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు నిర్వహించిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తారన్నారు. వీటికి రూ.6.12కోట్లు కూలీలకు వేజ్ పేమెంట్, రూ.3.58 కోట్లు పంచాయతీరాజ్‌లో నిర్వహించిన పనులకు సంబంధించనవి ఉన్నాయన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందం సభ్యులు పర్యటిస్తున్నారని చెప్పారు.

పాపం పసి పాప

- చిన్నారి గొంతులో ఇరుక్కున్న మెంతోప్లస్ ప్లాస్టిక్ బిల్ల
- ఊపిరాడక మృతి



చిన్నారి జ్ఞానేశ్వరి(ఫైల్)

దౌల్తాబాద్: కేరింతలు కొడుతూ ఆడుకుంటున్న చిన్నారి గొంతులో మెంతో ప్లస్ ప్లాస్టిక్ బిల్ల ఇరుక్కుని, ఊపిరాడక చనిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని ఈర్లపల్లికి చెందిన ముశ్రీఫాబందెప్ప, కళ్యాణి దంపతులు బుధవారం రాత్రి తమ తొమ్మిది నెలల చిన్నారి జ్ఞానేశ్వరితో కలిసి నిద్రించారు. ఈ సమయంలో చిన్నారి చేతికి తగిలిన మెంతోప్లస్ బిల్లను నోట్లో పెట్టుకోగా గొంతులో ఇరుక్కుంది. పాప ఏడుపు వినిపించడంతో మేల్కొన్న తల్లిదండ్రులు.. గొంతులో ఇరుక్కుపోయిన బిల్లను చేతులతో బయటకు తీసే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతిచెందింది.

ఎస్సీ, ఎస్టీలకే సబ్‌ప్లాన్ నిధులు

- దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు
- ప్రతీ నెల చివరి శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ తదితరులు

అనంతగిరి: ప్రతీ మూడు నెలలకు ఓసారి డీవీఎంసీ (డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ) సమావేశాలు నిర్వహించి సంబంధిత శాఖల అధికారులు పాల్గొని జిల్లాలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం ఆయన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నుంచి వివిధ శాఖల ద్వారా ఎస్సీ వర్గాలకు వెచ్చిస్తున్న నిధులపై కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఎస్సీ, ఎస్టీ సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. జనాభా ప్రాతిపదికన వాటాలకు అనుగుణంగా నిధులు ఖర్చు చేయాలని అధికారులకు సూచించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ భూ సమస్యలు పరిష్కారం చూపాలన్నారు. జూలై నుంచి ప్రతీ నెల చివరి శనివారం పౌర హక్కుల దినం నిర్వహించి ఈ కార్యక్రమానికి తహసీల్దార్, పోలీస్ అధికారి తప్పక హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు సూచించారు. చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస్ పథకాల్లోనూ వాటాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలకు అవకాశాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ల పథకాల్లో అర్హులైన పేదలకు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పదోన్నతుల్లో ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, సభ్యులు లక్ష్మీనారాయణ, శంకర్, రాంబాబు నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, ఎం.సుధీర్, డీవీఎంసీ సభ్యులు పెండ్యాల అనంతయ్య, గోవింద్ నాయక్, దస్తప్ప, ఎస్.రాజలింగం, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాల సందర్శన

వికారాబాద్‌కు విచ్చేసిన బక్కి వెంకటయ్య కొత్తగడి రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కిచన్, స్టోర్‌రూంను పరిశీలించి భోజన సదుపాయాలపై ప్రిన్సిపాల్ సాయిలత. డీఎస్సీడీఓ కమలాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని తెలుసుకున్నారు.

తేనీటి విందు

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు రాంబాబునాయక్, శంకర్, వికారాబాద్ పర్యటనకు వచ్చిన నేపథ్యంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ నివాసానికి వెళ్లి తేనీటి విందు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ ఉద్యమ కాలం జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజలింగం, మాజీ కౌన్సిలర్ కిరణ్‌పటేల్, సురేశ్‌గౌడ్, దేవదాసు, కేదార్‌నాథ్, శాంత్‌కుమార్, రుకుం, సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టండి

తాండూరు రూరల్: తాండూరు ప్రాంతంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం వికారాబాద్ కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశానికి హాజరైన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అట్రాసిటీ కేసులను నీరుగారుస్తున్నారని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. తాండూరులో పర్యటించి దళితులకు అండగా నిలవాలని చైర్మన్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, కేవీపీఎస్ కార్యదర్శి మల్కయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జినుగుర్తి నర్సింలు ఉన్నారు.

క్లుప్తంగా

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

పరిగి: ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమాలను అందేలా కృషి చేస్తామని పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి గ్రామాల్లో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు రాకేష్, సామేల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంతో జీవితాలు నాశనం

బండవెల్కిచర్లలో మద్యపాన నిషేధంపై అవగాహన ర్యాలీ



మద్యపాన నిషేధం ర్యాలీలో పాల్గొన్న యువత, విద్యార్థులు

కుల్కచర్ల: మద్యపానాన్ని నిషేధించడంతో గ్రామం అభివృద్ధి పథంలో సాగుతుందని మండలంలోని బండవెల్కిచర్లకు చెందిన యువత ముందడుగు వేశారు. కలిసి వచ్చిన గ్రామస్తులు, మహిళా సంఘాల సహకారంతో ఊరిలో మద్యపానం అమ్మకాలను నిషేధించాలని గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. వాటి జోలికి పోవద్దని సూచించారు. మొదటగా మహిళా సంఘాలు, పాఠశాల విద్యార్థులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. మద్యపాన నిషేధానికి పెద్దఎత్తున యువత ముందుకు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ అధికారుల కనుసన్నల్లో కొనసాగుతున్న బెల్టు దుకాణాల మూసివేత సాధ్యమయ్యేనా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఇంటికీ కేంద్ర పథకం

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి



మాట్లాడుతున్న సదానందరెడ్డి

అనంతగిరి: ప్రతి ఇంటికీ కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకం అందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సదానందారెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి వికారాబాద్ మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో వికసిత్ భారత్ సేవా సుపరిపాలనలో భాగంగా సంకల్పసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనలో దేశంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. నేడు గ్రామాలన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి చెందాయన్నారు. భారత్‌ను ప్రపంచంలోనే బలీయమైన దేశంగా నిలిపారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివరాజుగౌడ్, రాష్ట్ర నాయకులు అమరేందర్‌రెడ్డి, బస్వలింగం, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, గోపాల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలిలో క్షతగాత్రులు

కొత్తూరు: టిప్పర్ లారీ, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో జేపీదర్గా రోడ్డులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన నరేష్(38) తన బంధువు(వృద్ధురాలు)తో కలిసి బైకుపై ఇన్ముల్‌నర్వ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. కాగా మార్గమధ్యలో వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా వెనకాల నుంచి వచ్చిన టిప్పర్ బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాదస్థలికి చేరుకొని పరిశీలించారు.



గోనూరు సమీపంలో ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు



నేలమట్టం కానున్న రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు

రహదారి.. రైట్.. రైట్

- అగ్గనూర్–బషీరాబాద్ మధ్య రోడ్డు విస్తరణ
- రూ.106 కోట్లతో శరవేగంగా సాగుతున్న పనులు
- 13 మీటర్ల వెడల్పుతో నిర్మాణం

బషీరాబాద్: అంతర్రాష్ట్ర రహదారి పనులు ప్రారంభమవ్వడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ వెడల్పుతో నిర్మిస్తున్న అగ్గనూర్–బషీరాబాద్ మధ్య రోడ్డు పనులు గురువారం మొదలయ్యాయి. 13 మీటర్ల వెడల్పుతో 16.8 కిలోమీటర్ల రోడ్డును రూ.68 కోట్లతో, బషీరాబాద్ నుంచి మైల్వార్‌కు 11.6 కిలోమీటర్లు ఉన్న సింగిల్ రోడ్డును 10 మీటర్ల వెడల్పునకు విస్తరించే పనులు ఒకేసారి శ్రీకారం చుట్టారు. దీని కోసం మరో రూ.38 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. ఈ విస్తరణ పనులు పూర్తయితే అటుగా వెళ్లే తెలంగాణ, కర్ణాటక ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది.

అంతర్రాష్ట్ర రవాణా సుగమం


యాలాల మండలం లక్ష్మీ నారాయణపూర్ దగ్గర జాతీయ రహదారిని కలుపుతూ బషీరాబాద్ మీదుగా మైల్వార్ వరకు నిర్మాణం అవుతున్న ఈ రోడ్డు అంతర్రాష్ట్ర రవాణాకు సుగమం చేయనుంది. మైల్వార్ నుంచి పారుగునున్న కర్ణాటకలోని ఆడికి దగ్గర మరో అంతర్రాష్ట్ర రహదారిని అనుసంధానం చేయనుంది. ఈ రోడ్డు మీదుగా కర్ణాటకలోని సేడం, గుల్బర్గా, యాద్గీర్‌తో పాటు గోవా వెళ్లే ప్రయాణికులు ఇటునుంచే ప్రయాణించనున్నారు. ఇదిలా ఉండగా యాలాల మండలం బండమీదిపల్లి గేటు నుంచి మైల్వార్ వరకు నిర్మించే మరో డబుల్ రోడ్డు బషీరాబాద్ నుంచి వెళ్లే రోడ్డును కలుపుతుంది.

తొలగించనున్న 2 వేల చెట్లు

లక్ష్మీనారాయణపూర్ నుంచి మైల్వార్ వరకు రోడ్డుకు ఇరువైపులా రెండు వేలకు పైగా చెట్లు ఉన్నాయి. వీటిలో 25 ఏళ్లకు పైబడిన వృక్షాలు మొదలుకొని 5 ఏళ్ల కిందట నాటిన మొక్కలు ఉన్నాయి. వీటిని మొత్తం నరికి వేయడానికి ఆర్అండ్‌బీ శాఖ అటవీ శాఖ అనుమతులను కోరింది. అటవీ శాఖ అనుమతులు రాగానే వేలం పాట వేసి చెట్లను నరికివేయనున్నారు. అయితే అటవీ శాఖ నుంచి అనుమతులు ఇంకా రాకపోవడంతో చెట్లు లేని దగ్గర రోడ్డు పనులు సాగుతున్నాయి.

రైతు భరోసాలో కత్తెర

- నగానికి నగం భూమి తగ్గించి రైతు ఖాతాలో నగదు జమ
- లబోదిబోమంటున్న అన్నదాతలు



1.33 ఎకరాలకు 29 గుంటలే రైతు ఖాతాలో జమ అయిన నగదు

ధారూరు: ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా నగదుపై మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందులో పలు అభ్యంతరాలు ఉన్నాయని పేర్కొన్నారు. పట్టా పాసు పుస్తకాల్లో ఉన్న భూ విస్తీర్ణం కంటే తక్కువగా భరోసా డబ్బులు తమ ఖాతాల్లో జమ అయ్యాయని గురువారం మండిపడ్డారు. అందులో మచ్చుకు.. తరిగోపుల గ్రామానికి చెందిన అల్లాడ రాంచంద్రారెడ్డికి 1.33 ఎకరాల పొలం ఉంటే కేవలం 29 గుంటలకే రైతు భరోసా డబ్బులు వచ్చాయి. రూ.10,950కి బదులుగా రూ.4,350 ఖాతాలో జమ అయ్యాయని వాపోయాడు. అంతా పంట పొలమే అయినా మొత్తం డబ్బులు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే.. ప్రభుత్వం చేయించిన ఆన్‌లైన్ సర్వే ప్రకారం నగదు జమ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేయడం గమనార్హం. అదే గ్రామానికి చెందిన ఆనంద్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు సైతం భూమి ఎక్కువ ఉంటే డబ్బులు నగానికి నగం తగ్గించి వేశారని లబోదిబోమంటున్నారు.

వెంటనే జమ చేయాలి

పట్టా పాసుపుస్తకాల్లో ఎన్ని ఎకరాలు ఉంటే అంతకు భరోసా నగదు జమ చేయాలి. సాగు చేసిన పొలానికి సైతం పెట్టుబడి సాయం అందక పోవడం బాధాకరం. రైతు భరోసాలో రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాం. శాసనసభ స్పీకర్ ఈ విషయంలో తగిన చొరవ తీసుకుని పొలం ఉన్నంత మేర డబ్బులు వేయించాలి.

– జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు

ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య



ఉత్తమ విద్యార్థులను సన్మానిస్తున్న ఎస్ఐ, ఎంఈఓలు

ఎస్ఐ యాదగిరి

దుద్యాల్: ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమమైన విద్య అందుతుందని ఎస్ఐ యాదగిరి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రైవేట్ బడులలో కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య బోధించే ఉపాధ్యాయులు ఉంటారన్నారు. అనంతరం మండల వ్యాప్తంగా 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానించి అవార్డులు అందించారు. హకీంపేట్ పాఠశాలకు చెందిన శివాణి–537, శిరీష–527, దుద్యాల్ పాఠశాలకు చెందిన దివ్య–535, కవిత–509, కుదురుమల్ల పాఠశాలకు చెందిన శివ ప్రసాద్–490, ఆనంద్–480 సన్మానం పొందారు. దుద్యాల్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన దివ్యాంగ విద్యార్థులైన చరణ్‌కు బ్యాటరీ ట్రై సైకిల్, రాధికకు హియరింగ్ పరికరాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు విజయ రామారావు, హరిలాల్, ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, మల్లప్ప, సుధాకర్‌రావు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కసాయి కొడుకుకు కటకటాలు

కన్న తండ్రిని హతమార్చిన కేసులో రిమాండ్



నిందితుడు శేఖర్

కందుకూరు: కన్నతండ్రినే అతి కిరాతకంగా హతమార్చిన ఘటనలో కొడుకును పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పులిమామిడి గ్రామానికి చెందిన భార్యాభర్తలు పసుపుల చిన్న జంగయ్య, పద్మమ్మలకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. వీరందరికి వివాహాలు చేశారు. గ్రామంలో ఉన్న అర ఎకరం పొలం దున్నుకుంటూ మరోపక్క గొర్రెలు మేపుకొంటూ జీవిస్తున్నారు. కాగా కొడుకు శేఖర్ తన భార్య పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్దనే ఉండేవాడు. ఏడాది క్రితం పాత ఇల్లు కూల్చివేసి కొత్తగా ఇంటిని నిర్మించే క్రమంలో భార్య పిల్లలతో కలిసి వేరే చోటుకి మారాడు. పిల్లర్లు, స్లాబ్ మాత్రమే వేసి ఆగిన ఇంట్లో తల్లిదండ్రులు ఉంటున్నారు. రాత్రిపూట తల్లి గ్రామంలో ఉండే చిన్న కూతురు ఇంటికి వెళ్లి నిద్రించేది. కాగా డబ్బులు లేక నిర్మాణం మధ్యలో ఆగడంతో ఉన్న అర ఎకరం పొలం అమ్మి ఇల్లు పూర్తి చేయాలని కొడుకు తరచూ తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. పెద్దలు పంచాయితీ పెట్టి చెప్పినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. కాగా రెండు రోజుల క్రితం భార్య పిల్లలు పుట్టింటికి వెళ్లారు. దీంతో 17న రాత్రి తన తల్లిదండ్రులతో కలిసి శేఖర్ నిర్మాణంలో ఉన్న ఇంట్లోనే భోజనం చేశాడు. అనంతరం కొడుకు అద్దె ఇంటికి, తల్లి చిన్న కూతురు వద్దకు నిద్రించడానికి వెళ్లగా, చిన్నజంగయ్య అక్కడే నిద్రించాడు. ఇదే అదునుగా చూసుకుని అర్ధరాత్రి శేఖర్ తండ్రి వద్దకు వచ్చి బండరాయితో పాటు కర్రతో మోది హతమార్చిన ఘటన విదితమే. కాగా నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీలో అడ్మిషన్లు

ఇబ్రహీంపట్నం: డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, సహాయ కేంద్రం కో–ఆర్డినేటర్ శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ఆగస్టు 13 వరకు గడువు ఉన్నట్లు వెల్లడించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాలల్లో ఇంటర్(తత్సమాన) అర్హత కలిగిన వారుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 73829 29772 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు.

ప్రైవేట్ బడుల దోపిడీ అరికట్టాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్

చేవెళ్ల: ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంలు, పెన్నులను అమ్ముతూ దందాను కొనసాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన జిల్లా విద్యాధికారి కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు, అధిక ఫీజులు, అడ్మిషన్ పేరిట రూ.లక్షలు వసూళ్లు చేస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి ప్రైవేటు పాఠశాలలను గుర్తించి వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించకుండా పేద విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నారని మండిపడ్డారు.

భూ సమస్యలకు పరిష్కారం



ఎక్‌మామిడిలో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎక్ మామిడి గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ సమస్యలను దరఖాస్తు రూపంలో సమర్పించాలని, అధికారులు తప్పకుండా పరిష్కారం చేస్తారన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య, డీటీ శ్రీలత, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, ప్రభాకర్, ఎండీ రఫీ, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రసీదులు తప్పనిసరి



చేవెళ్లలో ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ శంకర్‌లాల్

చేవెళ్ల: రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాధికారి శంకర్‌లాల్ సూచించారు. మండలంలోని సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు గురువారం దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి విత్తనాలు, ఎరువులు, ఫర్టిలైజర్‌ల నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టార్లను చెక్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దుకాణాల్లో ఎప్పటికప్పుడు స్టాక్ నిల్వల వివరాలను బోర్డులపై పెట్టాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రసీదును అందించాలని సూచించారు. నాణ్యత లేని విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే దుకాణాదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీదర్ టు హైదరాబాద్

- గంజాయి అక్రమ రవాణా
- నలుగురు యువకుల అరెస్ట్
- ఐదు కిలోల గంజాయి స్వాధీనం

రాజేంద్రనగర్: బీదర్ నుంచి గంజాయిని తీసుకొచ్చి నగరంలో విక్రయించేందుకు యత్నించిన నలుగురు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి కారుతో పాటు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మామిడి కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజేంద్రనగర్ బుద్వేల్‌కు చెందిన జగదీష్, నరేందర్, చింతల్‌మేట్‌కు చెందిన రామ్ కుమార్ స్నేహితులు. చెడు అలవాట్లకు బానిసలైన వీరు బీదర్ వెళ్లి గంజాయిని తీసుకొచ్చి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా కారులో బీదర్ వెళ్లిన వారు మహేశ్ అనే వ్యక్తిని సంప్రదించగా అతను రూ. 40 వేలకు ఐదు కిలోల గంజాయిని విక్రయించాడు. సరుకు తీసుకుని నగరానికి వస్తుండగా సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు గురువారం మధ్యాహ్నం కారును ఆపి సోదా చేయగా ఐదు కిలోల గంజాయిని గుర్తించారు. కారుతో పాటు గంజాయిని సీజ్ చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.గంజాయి విక్రయించిన మహేశ్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

దోపిడీ కేసులో నిందితుల రిమాండ్

కాచిగూడ: ప్రయాణికుడిపై దాడిచేసి అతడి నుంచి నగదు, సెల్‌ఫోన్ లాక్కెళ్లిన కేసులో ఇద్దరు నిందితులను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్. జావేద్, ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, వివరాలు వెల్లడించారు. మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో కనకయ్య అనే వ్యక్తి ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడి చేసి నగదు, మొబైల్ ఫోన్ లాక్కుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో కాచిగూడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన బతుకమ్మ కుంట ప్రాంతానికి చెందిన దాసరి మౌనిక, పోతుగల్ ప్రాంతానికి చెందిన బి.సుక్కయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి సెల్‌ఫోన్, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.



ఒరిగిన స్తంభం.. ప్రమాదానికి సంకేతం

మండల పరిధిలోని టేకుల్‌కోడ్ గ్రామం నుంచి తండాకు వెళ్లే దారిలో పొలాల్లో వేసిన ఓ విద్యుత్ స్తంభం ఒక వైపునకు ఒరిగి ప్రమాద భరితంగా మారింది. వర్షాకాలం వేళ బలమైన ఈదురుగాలులకు నేలకూలే అవకాశం లేకపోలేదు. పెను ముప్పు వాటిల్లకముందే అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. – కొడంగల్ రూరల్

మట్టి జారి.. ప్రమాదంగా మారి!



దుద్యాల్– అల్లిఖాన్‌పల్లి మార్గంలో కోసుకుపోయిన మట్టి

దుద్యాల్: చెరువు కట్టపై వేసిన రోడ్డు ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రం నుంచి అల్లిఖాన్‌పల్లి గ్రామానికి రెండు నెలల క్రితం వేసిన వేసిన బీటీ రోడ్డు ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తుంది. ఇటీవల కురిసిన సాధారణ వర్షానికే రోడ్డు పక్కల మట్టి కోసుకుపోయి పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకల సమయంలో రహదారి దిగేటప్పుడు అనుకోని ప్రమాదం సంభవించే ఆస్కారం లేకపోలేదు. ఈ వర్షాకాలం మరింత ఇబ్బందికర పరిస్థితుల తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు కట్ట రోడ్డుని పటిష్ట పరిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దుద్యాల్ చెరువు కట్ట దుస్థితి

భక్తిభావం కలిగి ఉండాలి

శ్రీ హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ



వార్షికోత్సవ పూజలో విద్యారణ్య భారతి

యాచారం: భక్తిభావం ఉన్న చోట ప్రజలు సంతోషంగా ఉంటారని, పసిడి పంటలు సస్యశ్యామలంగా ఉంటాయని శ్రీ హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ పేర్కొన్నారు. తక్కళ్లపల్లి తండాలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో గురువారం వార్షికోత్సవంలో స్వామిజీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు భక్తిభావం పట్ల దృష్టి పెట్టాలని సూచించారు. నూతన దేవాలయాల నిర్మాణం, పురాతన దేవాలయాలను అభివృద్ధి చేయడం కోసం కృషి చేయాలన్నారు. పర్వతారోహకుడు అంగోత్ తుకారం చిన్న తనంలోనే బంగారు మైసమ్మ దేవాలయాన్ని నిర్మించి ఘనంగా నిత్య పూజలు, ఏటా వార్షికోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అంగోత్ తుకారాం, మానస దంపతులతో పాటు కుటుంబ సభ్యులు రాందాసు, జంకు, వెంకటేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి



సోలార్ గ్రిడ్‌ను ప్రారంభిస్తున్న అమెజాన్ సీఎస్ఆర్ విభాగాధిపతి తాతాజీ

షాబాద్: పేద విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉండాలని అమెజాన్ సీఎస్ఆర్ విభాగాధిపతి తాతాజీ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ పవర్ గ్రిడ్‌ను పర్యావరణవేత్త లిబో కోహెన్, రాజేష్‌మైసా, రీజనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వినయ్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా, వైద్యం కోసం అమెజాన్ వెబ్ సర్వీసు ఎంతో ఖర్చు చేస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో షాబాద్‌లోని ఆదర్శ పాఠశాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా సంస్థ మౌలిక వసతులు కల్పించినట్లు తెలి పారు. పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, అమెజాన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.